www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 మార్చి 2023

5

కాకినాడ



ఉమెన్ ఐకాన్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పిఠాపురం

పురపాలక సంఘంలో మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి 'ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023' అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకటనలో వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగంవంటి విభాగాలలో కృషిచేస్తున్న మహిళలు అర్హులన్నారు.అర్హత కలిగినవారు ఈ నెల 22 లోపు మెప్మా కార్యాలయం వద్ద దరఖాస్తులను అందజేయాలన్నారు.ఎంపికైన వారికి జూన్ 5వ తేదీన జరుగు నున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సభలో అవార్డులను అందజేస్తామని ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- జనరల్‌కు 18714 మంది హాజరు
- ఒకేషనల్‌కు 1378 మంది హాజరు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో 60 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 వ సెక్షన్ అమలు చేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులకు ఏ ఇబ్బంది కలుగకుండా తాగునీటి సౌకర్యం ఏర్పాటుచేశారు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 60 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా అధికారి నూకరాజు తెలిపారు. మొదటిరోజు తెలుగు 1, సాంస్క్రిట్ 1, హిందీ 1, పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు. ఇందుకు గాను, జనరల్ పరీక్షకు సంబంధించి మొదటిరోజు 19377 మందికి గాను, 18714 హాజరయ్యారని, 663 మంది విద్యార్థులు గైరాహజరు అయ్యారని, ఒకేషనల్ కోర్సుకు 1475 మందికి గాను 1378 మంది హాజరు కాగా 97 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. . ఏ పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్‌తో ఎవ్వరూ పట్టుపడలేదన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎటువంటి అంతరాయం లేకుండా ప్రశాంత వాతా వరణంలో మొదటిరోజు ఇంటర్ పరీక్షలు ముగిసినట్లు తెలిపారు. **పిఠాపురం** పట్టణంలో ఇంటర్ పరీక్ష నిర్వహణకు 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్ ఆర్ బిహెచ్ ఆర్ ప్రభుత్వ



పిఠాపురం ఆర్ ఆర్ బిహెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

జూనియర్ కళాశాలలో 333 మంది కి గాను 319 విద్యార్థులు, హుసుమంతరాయ కళాశాలలో 272 మందికి 238, అంజనా కళాశాలలో 164 మందికి 151, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాలలో 240 మందికి 221 మంది హాజరు కాగా 80 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండాపోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. **కాజులూరులో** ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 21 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 309 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా తెలుగు పరీక్షల్లో 19 మంది, హిందీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు హాజరు కాలేదని 288 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. **రౌతులపూడి** మండలం ఏ. మల్లవరం గురుకుల కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను తనిఖీ అధికారులు బుధవారం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇంటర్మీడియట్ తెలుగు, సంస్కృత పరీక్షకు 127 మందికి గాను 105 మంది విద్యార్థులు, వృత్తి విద్య కోర్సుకు సంబంధించి15 మంది విద్యార్థులకు పూర్తిగా విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష నిర్వహణాధికారులు సత్యనారాయణ. లక్ష్మణరావు తెలిపారు. **కరప** మండలం వేళంగి జూనియర్ కళాశాలలోఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఇంగ్లీష్ పరీక్షకు 123 విద్యార్థులు హాజరు కాగా, ఏడుగురు హాజరు కాలేదని తెలి పారు. మహిళా పోలీస్ యశోద, వైద్య సిబ్బంది లాల్ మొహమ్మద్ ఆధ్వర్యంలో పరీక్షాకేంద్రం వద్ద పర్యవేక్షించారు.



వేళంగి కళాశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

మహిళా హక్కులు మానవ హక్కులే

ప్రజాశక్తి - కాకినాడ

పనిప్రదేశాలలో లైంగిక వేధింపులు అరికట్టాలని శ్రామిక మహిళ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవసభ కాకినాడ మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిఐటియు శ్రామిక మహిళ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సుందరయ్య భవన్ వీధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవసభ నిర్వహించారు. ఈ సభకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ అధ్యక్షత వహించగా, సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ జి.బేబీరాణి ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. 1986లో డెన్మార్క్ రాజధాని ఓపెన్ లో అంతర్జా తీయంగా క్లారా జెట్కిన్, రోజా లగ్జంబర్గ్, కృపస్కాయ, అలెగ్జాండర్ కొల్లంతా తదితర సోషలిస్టు మహిళలు శ్రామిక మహిళల హక్కుల కోసం నినదిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి నాంది పలికారని తెలిపారు. 1917లో రష్యాలో ఏర్పడిన కార్మిక రాజ్యం తొలిసారిగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమానత్వానికి బాటలు వేసిందన్నారు. ఐక్యరాజ్యసమితి 1975లో మహిళా దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. ప్రస్తుతం మన దేశంలో అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్ శక్తులు, బిజెపి పాలకులు మనువాద శాస్త్రాన్ని అమలు చేస్తూ మహిళలను కించపరిచే విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శిం చారు. బాలికలు, వృద్ధులు అనే తేడా లేకుండా మహిళలపై అత్యాచారాలు, హింస జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ విష సంస్కృతి దేశంలో తాండవిస్తోందన్నారు. చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బిల్లు రాజ్యసభలో ఆమోదం పొంది నేటికీ లోక్ సభలోకి రాలేదన్నారు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రామిక మహిళలకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకురాలు సిహెచ్ రమణి మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్లనే మహిళా సాధికారిత సాధ్యం కావడంలేదని తెలిపారు. విచ్చలవిడిగా పారు తున్న మద్యం కుటుంబాలలో మహిళలపై హింసను ప్రేరేపిస్తుందన్నారు. మహిళా రక్షణకు పోరాడి సాధించ ుకున్న చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.దుర్గాదేవి మాట్లాడుతూ భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు పూర్తిగా అమలు చేస్తే సమానత్వ దిశగా భారతదేశం ప్రయాణిస్తుందన్నారు. నేటి పాలకులు అవలంభిస్తున్న మనువు సిద్ధాంతాలు ఇప్పటికే మహిళలు సాధించిన అభివద్ధిని వెనక్కి లాగేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ఉపాధి కల్పన ద్వారా మహిళా సాధికారత సాధించి, సామాజిక రాజకీయ రంగాలలో సమానత్వ దిశగా సాగాలన్నారు. అందుకోసం ఐక్య పోరాటాలు అవసరమన్నారు. ఐద్వా నగర కార్యదర్శి కె.నాగజ్యోతి, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఇ.చంద్రావతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ ఈశ్వరి, చంద్రమళ్ళ పద్మలతో పాటు ఎం.రమణమ్మ, భారతి, జ్యోతి తదితరులు మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమాలు పోరాటాలు సాగించడం ద్వారా మహిళా హక్కులు కాపాడుకుంటూ మరిన్ని హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేష బాబ్జి మాట్లాడుతూ సమాజంలో దోపిడీ అంతానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు పెరగడం ద్వారానే మహిళా సమానత్వం కూడా సాధ్యమవుతుందన్నారు. భారతదేశంలో సామాజిక రుగ్మతలలో మహిళలను చిన్న చూపు చూసే పద్ధతి కొనసాగడం సిగ్గుచేటని దీనిపై ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు ప్రత్యేకమైన కషిచేసి మహిళలను తగిన రీతిగా గౌరవించాలని కోరారు. సభానంతరం సుందరయ్య భవన్ నుండి పాత బస్టాండ్ మీదుగా మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సంఘాల నాయకులు టీ నాగమణి, దాడి బేబీ, ధనలక్ష్మి, రాజేశ్వరి, మేరీ సమాధానం, అమలావతి, సుబ్బలక్ష్మి, కామేశ్వరి, జ్యోతి, చామంతి, ఎ.పద్మావతి, సూర్యకాంతం, ఎం నాగలక్ష్మి, ఎస్ సత్యవతి, రత్నకుమారి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కళావతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా నాయకులు జి.బేబిరాణి, కె.దుర్గాదేవి శామిక మహిళలు

జిల్లాలో రబీకి 1.82 లక్షల ఎకరాల్లో ఈ పంట నమోదు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో 2022-23 రబీ సీజన్ కు సంబంధించి 1,82,358 ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీల నిమిత్తం ఈ క్రాప్ ముసాయిదా జాబితాలను జిల్లా లోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 17 వరకు ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. . అలాగే ప్రతీ ఆర్‌బికె వద్ద గ్రామసభలు నిర్వహించి జాబితాలో వున్న రైతుల వివరాలను సిబ్బంది చదివి వినిపిస్తారని, మార్పులు చేర్పులు వుంటే సరిచేసి, సవరించిన తుది జాబితాలను తిరిగి ప్రదర్శిస్తారని తెలిపారు. రైతులు తమ పరిధి లోని ఆర్‌బికెలకు వెళ్లి సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించిన ఈ క్రాప్ ముసాయిదా జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు వుంటే రాత పూర్వకంగా తెలియ జేయాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ కుమార్ తెలియజేశారు. గ్రామ సభల్లో తుది జాబితాల ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు చేర్పులు చేసే అవకాశం వుండదన్నారు.

విద్యార్థులు జ్ఞానాన్ని పెంచుకోవాలి

-ఆర్‌జెడి నాగమణి

ప్రజాశక్తి కాకినాడ

ఎక్కువ సమయాన్ని టాబ్లో అంశాలను విని అవగాహన చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి విద్యార్థులకు సూచించారు. పాఠశాల కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి నాగమణి కాకినాడ గోడారిగుంట హైస్కూల్‌లో ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి 8వ తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి, విద్యార్థులు చురుకుగా జవాబులివ్వడంతో పాటు తమతో టాబ్‌లు తీసుకు రావడం గమనించి అభినందించారు. అనంతరం పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే 10వ తరగతి విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. ఎక్కువ మార్కులతో మంచి ఉత్తీర్ణత సాధించి అందరి ఫోటోలు ఫ్లెక్సీలో నేను చూడాలని విద్యార్థులను కోరారు పాఠశాల పని తీరు, విద్యార్థుల క్రమశిక్షణపై ఆర్‌జెడి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై శ్రీనివాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి నాగమణి

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ కె రమేష్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన కాకినాడ ఇందిరా కాలనీ, సాంబమూర్తి నగర్, రాగంపేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. కార్మికుల మస్తర్లను పర్యవేక్షించారు. తడిపొడి చెత్త సేకరణ, విభజించి ఇస్తున్న తీరును పరిశీలించారు.. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు టి ప్రసాద్, కె సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నక్కా భారతి

నీట్ పరీక్షలో కరప విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కరప

కరప గ్రామానికి చెందిన నక్కా భారతి ఆల్ ఇండియా నీట్ పరీక్షలో ప్రతిభ చూపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 3026 ర్యాంకుతో పోస్ట్ గ్రాడ్యు యేషన్ వైద్య విద్యకు అర్హత సాధించడంతో కరప గ్రామం పూర్వ విద్యార్థులు నాయకులు భారతికి అభినందనలు తెలియజేసిన వారిలో ఉన్నారు. జడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి సత్తిబాబు సర్పంచ్ ఆశాజ్యోతి కుమార్, పి.తాతీలు డాక్టర్ బోండా సూర్యారావు భారతిని అభినందించారు.

రైతులకు బ్యాంకింగ్ సేవలు చేరువ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

రైతులకు బ్యాంకింగ్ సేవలను చేరువచేసేందుకు బిజినెస్ కరస్పాండెంట్లు తప్పనిసరిగా ప్రతి బుధవారం, గురువారం రైతు భరోసా కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు అందుబాటులో ఉండేలా చూడాలని బ్యాంకు అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా సూచించారు. బుధ వారం కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాల్‌లో లీడ్ జిల్లా కార్యాలయం ఆధ్వ ర్యంలో జెసి అధ్యక్షతన 2022-23 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసి కానికి సంబంధించి జిల్లా సలహా కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశాలు జరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బ్యాంకర్లకు జాయింట్ కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రుణాలు మంజూరు, కౌలు రైతులకు రుణాలు, విద్యా రుణాలు, ఏపీ టిడ్కో రుణాలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులతో పాటు పశు సంవర్ధక, మత్స్యరంగ రైతుల సంక్షేమం కోసం వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలవుతున్న నేపథ్యంలో వారికి



డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న జెసి ఇలాక్కియా

బ్యాంక్ సేవలపై అవగాహన పెంపొందించింది, అవి చేరువయ్యేలా చూడాలన్నారు. ఆర్థిక సమ్మిళిత (ఎఫ్ఐ) శిబిరాల్లో స్వీకరించిన ముఖ్యంగా కేసీసీ (పశుసంవర్ధక, మత్స్య), టిడ్కో, విద్య తదితర రుణాలకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 27,505 మంది కౌలు రైతులకు రూ. 28.06 కోట్ల మేర రుణాలు మంజూ రైనట్లు తెలిపారు. ఇదే విధంగా పశు సంవర్ధక, మత్స్య రంగ రైతులకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని సూచించారు. ఏపీ టిడ్కోకు సంబంధించి 5,064 మందికి రుణాలు మంజూరు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3,386 మందికి రుణాలు మంజూరయ్యాయని.. మిగిలిన దరఖాస్తులను కూడా వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. జగనన్న తోడు ఆరో విడతకు సంబంధించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల లబ్ధిదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. బ్యాంకులు తప్పనిసరిగా ఆర్థిక అక్షరాస్యత, సమ్మిళిత శిబిరాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం (పీఎంఈజీపీ), స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, పీఎం స్వానిధి, నాబార్డు పథకాలు, మెప్మా కార్యకలాపాలు తదితరాలపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు కన్వీనర్ కెఎస్‌వి చిన్నారావు, ఎల్‌డీవో పీపీ పూర్ణిమ, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఎల్‌డీఎం సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, వ్యవసాయ శాఖ అధికారి ఎన్.విజయ్‌కుమార్, ఉద్యాన అధికారి బీవీ రమణ, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సూర్యప్రకాష్, వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు.



ఆర్‌డి నాగనరసింహారావును సత్కరిస్తున్న ఉద్యోగులు

చేసిన సేవలతోనే సంతృప్తి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలే ఎల్లప్పుడు సంతృప్తిని స్తాయని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. పుర పరిపాలన శాఖ రీజనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన నాగనరసింహారావును మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయిస్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. వివిధ విభాగాధిపతులు, ఉద్యోగ సంఘాల ప్రతి నిధులు ఆయనను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాగనరసింహారావు మాట్లాడుతూ 22 ఏళ్ల సర్వీసులో ప్రతీ ప్రాంతంలోను ఉద్యోగుల సహకారంతో సంతృప్తికరమైన సేవలు అందించానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పధ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి జాన్‌పాల్, కోశాధికారి సత్తెప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు..

గణాంక నైపుణ్యాలతో కెరీర్ అవకాశాలు

-ఎన్‌ఎస్‌వో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ

గణాంకశాస్త్రంలో నైపుణ్యాలు పెంపొందించుకొంటే కెరీర్ పరంగా మంచి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ప్రాంతీయ జాతీయ గణాంక కార్యా లయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో)- కాకినాడ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ, పీఆర్ ప్రభుత్వ కళాశాలలో దేశ అభివద్ధిలో ఎన్ఎస్‌వో పాత్రపై ప్రత్యేక సదస్సు జరిగింది. ఎన్ఎస్‌వో కార్యకలాపాల్లో భాగమైన డేటాను సేకరించే విధానాలు, నమూనాలు, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో వాటి ఉపయోగం తదితరాలతో పాటు స్టాటిస్టిక్స్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాలపై కిరణ్‌కుమార్ అవగాహన కల్పించారు.



సదస్సులో ప్రసంగిస్తున్న కిరణ్‌కుమార్

స్టాటిస్టిక్స్ కోర్సులు పూర్తిచేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థి దశలో నైపుణ్యాలు పెంపొందించు కోవాలన్నారు. ప్రస్తుతం స్టాటిస్టిక్స్ కోర్సులు చేస్తున్న వారు మంచి ఉద్యోగ అవకాశాలు అందుకునేందుకు అనుసరించాల్సిన మార్గాలపై కిరణ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. జాతీయ గణాంక కార్యాలయం పరిధిలోని క్షేత్రీయ కార్యలాపాల విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్‌వో కార్యకలాపాలపైనా, సర్వేలు సందర్భంగా సరైన సమాచారం ఇవ్వడం ఎంత ముఖ్యమనే అంశంపైనా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ కళాశాలల విద్యార్థులకు క్విజ్ నిర్వహించి, విజేతలను సత్కరించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎస్ఎస్‌వో బి.ప్రసాద్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డి.చిన్నారావు, స్టాటిస్టిక్స్ విభాగం హెచ్‌వోడీ పి.జ్యోతి, ఎకనామిక్స్ అధ్యాపకులు వెంకటేశ్వరరావు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - కోటనందూరు

అల్లిపూడిలో మాస్టర్ ప్రైస్ ఔట్రీచ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గిడియన్స్ ఆర్మీ చర్చిలో బుధవారం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని వైసిపి మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, మండల కోఆప్షన్ సభ్యులు జగటాల కోట సత్తిబాబు, గిడియన్ ఆర్మీ వ్యవస్థాపకులు బొంగుర్ల లోవరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ అల్లిపూడి, ఎస్‌బి పట్నం గ్రామాలలో నిరుద్యోగ, నిరక్షరాస్య, విద్యావంతులైన మహిళలకు 40 మంది మహిళలకు 90 రోజుల పాటు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి, వారికి మిషన్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అన్నారు, దీని ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడడంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న చేదోడు పథకాల ద్వారా లబ్ధి పొందవచ్చు అని శిక్షణానంతరం తీసుకున్న సర్టిఫికెట్ల ద్వారా క్రాఫ్ట్ టీచర్‌గా ఉద్యోగ అవకాశాలు కూడా పొందవచ్చు అని తెలిపారు, కార్యక్రమంలో సర్పంచులు జగటాల వీరబాబు, సత్తిబాబు, స్వామి నాయుడు, నానాజీ, సన్నీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కార్టూ'నిజం'



లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలనే అమ్ముతారు కదా సార్..!!

గణా చిత్రాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 17వ తేదీన విడుదలవుతున్న గణా చిత్రాన్ని విజయవంతం చేయాలని నిర్మాతలు కోరారు. వర్ధమాన నటుడు విజయ్ కృష్ణ నటించిన గణా చలనచిత్ర బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా బుధవారం కాకినాడ నగరంలో ఉన్న పద్మాలయ స్టూడియోలో విలేకరుల సమావేశం నిర్వహించారు. హీరో విజయ్ కష్ణతో పాటు నిర్మాతలు సాయి కృష్ణారెడ్డి, కె.బాలప్రసాద్, బుచ్చిరెడ్డిలు చిత్ర విషయాలను వెల్లడించారు. ఈనెల 17వ తేదీన గణా చిత్రం ఆంధ్రా, తెలంగాణతో పాటు ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నామని, ఈ చిత్రానికి హీరో విజయ్ కష్ణ స్వయంగా కథను తయారు చేసుకుని ఆయనే దర్శకత్వం వహించారని తెలిపారు. సస్పెన్స్ థ్రిల్లర్‌తో ఈ సినిమా ఉంటుందని చెప్పారు. హీరో కీ.శే. సూపర్ స్టార్ కష్ణ, దర్శకుడు ఎస్‌వి కృష్ణారెడ్డిల స్థాయికి విజయకృష్ణ చేరాలనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ సినిమాలో హీరోయిన్లుగా సుకన్య, తేజులు నటించినట్లు తెలిపారు. పూర్తి నాణ్యతతో ఈ సినిమాని మూడున్నర కోట్ల వ్యయంతో నిర్మించినట్లు వారు చెప్పారు. హీరో విజయ్ కృష్ణ మాట్లాడుతూ నాయకుడుగా, ప్రతి నాయకుడుగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కాకినాడకు చెందిన మహనీయులు ఎంతోమంది చిత్ర పరిశ్రమలోకి వెళ్లి పేరు ప్రఖ్యాతులు గడించారని అందువల్లనే కాకినాడ నగరంలో ఈ ప్రివెంట్ వేడుకను జరుపుతున్నట్టు విజయకష్ణ చెప్పారు. తాను గతంలో దుర్మార్గుడు పాగల్, చిత్రాల్లో సినిమాలోను గోవింద భజ గోవింద వంటి చిత్రాల్లో నటించినట్టు హీరో విజయ్ కృష్ణ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిత్ర బృందం

ఆర్‌ఆర్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి

రౌతులపూడి : రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఆర్‌ఆర్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని ఆ చిత్ర దర్శక నిర్మాతలు కే బుజ్జి.పి వీఎస్ మణికంఠ కోరారు. రౌతులపూడి మహాలక్ష్మి థియేటర్ వద్ద బుధవారం ఆ చిత్రాన్ని ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో తాతారావు, కష్ణంరాజు తదితరులు ఉన్నారు.

పెద్దాపురం మండలంలో 1,514 మంది టెన్త్ విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం పరిధిలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు 1,514 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఎంఇఒ సిహెచ్ వి సత్యనారాయణ బుధవారం తెలిపారు. 14 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 1006 మంది విద్యార్థులు,13 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 508 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. వీరిలో 775 మంది బాలురు,737 మంది బాలికలు ఉన్నారన్నారు. ఇంగ్లీష్ మీడియంకి సంబంధించి 954 మంది, తెలుగు మీడియంకు సంబంధించి 560 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. టెన్త్ పరీక్షలు రాయడానికి పట్టణ పరిధిలో సాగర్ మున్సిపల్ హై స్కూల్, జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హై స్కూల్, లూథరన్ హై స్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మండల పరిధిలో కట్టమూరు జడ్‌పి హైస్కూల్, రాయ భూపాలపట్నం జడ్‌ఫి హైస్కూల్, చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్, దివిలి సాధన ప్రైవేట్ స్కూల్ పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించారన్నారు.

రూ 82.55 లక్షల ఇంటి పన్ను బకాయిలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను బకాయిలు రూ 3 కోట్ల 13 లక్షల 63 వేలు,పాత బకాయిలు రూ 57 లక్షల 80 వేలు ఉండగా ఇప్పటివరకు పాత బకాయిలు రూ 23 లక్షల 35 వేలు,ఈ ఏడాది బకాయిలు రూ 2 కోట్ల 65 లక్షల 53 వేలు వసూలయ్యాయని, ఇంకా పాత బకాయిలు రూ 34 లక్షల 45 వేలు, ఈ ఏడాది బకాయిలు రూ 48 లక్షల 10 వేలు వసూలు కావాల్సి ఉందన్నారు. పాత బకాయిలు 40 శాతం,ఈ ఏడాది బకాయిలు 84.67 శాతం వసూలయ్యాయన్నారు. ఈ బకాయిల వసూలు నిమిత్తం 5 ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారాల్లో కూడా పన్నులు కట్టించుకునేందుకు మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందిని నియమించామన్నారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో దూకి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం గౌతమి గోదావరి వంతెనపై నుంచి బుధవారం గోదావరిలోకి దూకి ఒక వ్యక్తి మృతి చెందారు. రామచంద్రపురం మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన దూళ్ళ సత్యనారాయణ(35) రావులపాలెం-జొన్నాడ వంతెనపై నుంచి దూకాడు. విషయం తెలుసుకున్న రావులపాలెం పోలీసులు నావపై వెళ్లి సుమారు అరగంట పాటు శ్రమించి అతనిని ఒడ్డుకు చేర్చారు. రావులపాలెం ఎస్ఐలు రమణ, సురేంద్ర, హైవే పెట్రోలింగ్ పోలీసులు వివిబి స్వామి, సిహెచ్ రామ్మోహనరావు, ఏసీ సిబ్బంది, క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి అనంతరం హైవే అంబులెన్స్ సిబ్బంది హైవే అంబులెన్స్ పై కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలూక అతను ఎవరనేది తెలియకపోవడంతో క్షతగాత్రుని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు స్థానికులకు సమాచారం అందించారు. పరిస్థితి విషమించడంతో అతను మృతి చెందాడు. మృతుడు దూళ్ళ సత్యనారాయణ రామచంద్రపురం గ్రామస్తుడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని తండ్రి రావులపాలెం పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఫిర్యాదు ఇవ్వగా రావులపాలెం ఎస్ఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై యువకుని అత్యాచారం

ప్రజాశక్తి - పెదపూడి

బాలికపై ఒక యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యువకుడుపై కేసు నమోదు చేసినట్లు పెదపూడి ఎస్ఐ పి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కైకవోలు గ్రామానికి చెందిన ఒక బాలిక స్థానిక జడ్పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఆమె ప్రతి రోజు సైకిల్‌పై పాఠశాలకు వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇనకోటి రాజు అనే యువకుడు ఆమె పాఠశాలకు సైకిల్‌పై వెళ్లి వచ్చేటప్పుడు మోటార్ బైక్‌పై వెంబడిస్తూ తాను నిన్ను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ రాత్రి రాజు బాలికను ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేయగా కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కాజులూరు

యానం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న వాసంశెట్టి శ్రీను నీ అరెస్టు చేసి అతని వద్ద నుండి 12 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నామని తాళ్ళరేవు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.వి.బి. కుమార్ తెలిపారు. బుధవారం ఉప్పిమిల్లిలో తనఖీలు చేస్తుండగా బస్‌షెల్టర్ వద్ద అనుమానస్పదంగా ఉన్న పెదపూడి మండలం పెద్దాడ గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనును తణికి చేయగా యానాం 12 కొనుగోలు చేసి పెద్దాడ తరలిస్తుండగా ఉప్పుమిల్లి వద్ద స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ దాడిలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపుల కేసులో వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వేధింపుల కేసులో ఏడు సంవత్సరాల తర్వాత ఒక వ్యక్తికి కొత్తపేట కోర్టు రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన సజ్జ కృష్ణవేణి 2016 సంవత్సరంలో భర్త, అత్తమామలు కుటుంబ సభ్యులు వేధింపులు తాళలేక కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణ వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు కృష్ణవేణి భర్త, అత్తమామలు బావగారు సత్తిబాబు తదితరులపై అప్పట్లో ఏడుగురుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆరుగురికి శిక్ష విధించారు. బావ అయిన సత్తిబాబు అప్పట్లో విదేశాలు వెళ్లిపోయాడు. అతను తిరిగి రావడంతో ఎస్ఐ సిహెచ్.సుధాకర్ బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో కళాశాల సిబ్బందికి సంకురాత్రి ఫౌండేషన్ కాకినాడ శ్రీ కిరణ్ నేత్ర శస్త్ర చికిత్సాలయం సహకారంతో ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. పెద్దాపురం విభాగం వారి నేతత్వంలో సుమారు 200 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్‌కు, మరికొందరిని కంటి అద్దాల కోసం సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ .ఐ.వి.వీరాంజనేయులు, విద్యార్థులను అభినందించారు. శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి పెద్దాపురం విభాగం డాక్టర్ కళ్యాణి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సేవా కార్యక్రమాల్లో డీన్లు ఎస్. రమాశ్రీ, జె.డి. వెంకటేష్, సుమారు 30మంది ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.

'ఆయుష్మాన్' సర్వే వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గ్రామాల్లో పెండింగ్‌లో వున్న ఆయుష్మాన్, ఎస్‌డిజి సర్వేలు వేగవంతానికి చర్యలు చేపట్టాలని గ్రామ వలంటీర్లను, సచివాలయాల సిబ్బందిని సామర్లకోట ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆదేశించారు. బుధవారం వేట్లపాలెం- 3వ గ్రామ సచివాల యంలో సర్వేలపై గ్రామ కార్యదర్శి, సచివాలయా సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించి సూచనలు ఇచ్చారు. గ్రామ కార్యదర్శి మోసే, సిబ్బంది, వలంటీరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

వాకతిప్ప ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను బుధవారం రాష్ట్ర వైసిపి నాయకులు రావు చిన్నారావు పరిశీలించారు. పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు ఆదేశాలతో మొదట ఐదు గదుల స్లాబ్ పనులను పరిశీలించి నాణ్యతగా నిర్మించాలని కోరారు. ఆయన వెంట వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు, ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి రాజకుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ పోతుల కోటారావు, ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి పాల్గొన్నారు.

యానాం వార్తలు

ప్రెసిడెంట్ గడువు పెంపు రద్దు చేయాలి

ఇప్పటి వరకు అవకతవకలపై విచారణ జరిపించాలి

- కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ డైరెక్టర్స్

ప్రజాశక్తి - యానాం



విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్లు

యానాం కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు, కమిటీ గడువు ఈ నెల 31తో ముగియనుండటంతో మరో మూడు నెలలు పెంచుతూ పుదుచ్చేరి కోపరేటివ్ డైరెక్టర్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ కమిటీ డైరెక్టర్లు పలువురు స్థానిక పరిపాలనాధికారి మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు డైరెక్టర్లు విలేకరులతో మాట్లాడుతూ కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు పొన్నాడ విఘ్నేశ్వరుడు ఎన్నిక సరైనది కాదని అప్పటినుండి తాము అనేక సార్లు ఫిర్యాదులు చేశామని ఆ కమిటీ డైరెక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 31తో తమ కమిటీ గడువు ముగియనుందని అయితే విఘ్నేశ్వరుడు తమకు వేరే కారణాలు చెప్పి సంతకాల చేయించుకుని కమిటీ కాలపరిమితిని పెంచే విధంగా పుదుచ్చేరి నుంచి అనుమతులు రప్పించుకు న్నారని తెలిపారు. ఆయన పదవీకాలంలో కోఆపరేటివ్ వ్యాపార లావాదేవీల్లో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోగా కోఆపరేటివ్ లిక్కర్ షాపులకు రెన్యూవల్ చేయించ డానికి సైతం డబ్బు లేదనటం విడ్డూరంగా ఉందన్నారు. లక్షలాది రూపా యలు ఆదాయం వచ్చినట్లు రికార్డులు ఉన్నప్పటికీ తమ వద్ద ఒక్క రూపాయి కూడా లేదని ప్రెసిడెంట్ చెప్పడం కనీసం ఒక్క నెల జీతం అయినా ఇవ్వాలని సిబ్బంది కోరినప్పటికీ జీతాలకే కాదు ఈఎస్ఐ, పిఎఫ్ కట్టడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవనడం దారుణం అన్నారు. ఈ మేరకు స్టోర్స్ అధ్యక్షుడి గా ఉన్న కాల పరిమితిలో మొత్తం జరిగిన వ్యాపార లావాదేవులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని వినతిపత్రంలో పేర్కొన్నామని డైరెక్టర్లు మట్టపర్తి మంగ, నల్లానాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, ఎండి బేగమ్ తదితరులు తెలిపారు.

ఫ్రెంచ్ లింకింగ్ ఛానల్ పరిశీలన

మంచినీటి సమస్యపై వస్తున్న ఫిర్యాదుల మేరకు బుధవారం ఆర్ఏఓ మునిస్వామి పిల్లంకలో ఉన్న ఫ్రెంచ్ లింకింగ్ ఛానల్‌ను పరిశీలించారు. అనంతరం యానాం సరిహద్దు అరటికాయలలంకలో ఉన్న పంపింగ్ హౌస్‌ను అధికారులు ఏఇ కాళ్ల నాగరాజు, జెఇ యాళ్ళ వీరాస్వామి, జ్యోతిరాజుతో కలిసి ఆర్ఏఓ పరిశీలించారు.



పిల్లంక కాలవను పరిశీలిస్తున్న ఆర్ ఏ ఓ మునిస్వామి



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

వైయస్సార్ కంటి వెలుగు వైద్యశిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెంలో బుధవారం వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తమాలజిస్ట్ సత్తిబాబు సుమారు 100 మందికి పరీక్షలు చేసి పదిమందిని కాకినాడ జిజిహెచ్‌కు శస్త్ర చికిత్స కై తరలించారు.90 మందికి ఉచితంగా వైయస్సార్ కంటి వెలుగు కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, వైసిపి నాయకులు కొపనాతి నాగరాజు, ఎంఎల్‌హెచ్ పి.లక్ష్మీ సిందూజ, ఏఎన్ఎం. మాధవి, పంచాయతీ కార్యదర్శి రామరాజు, వార్డు సభ్యులు బర్రె కాట వేణి, సంగాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ముఖ్యం

-వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ప్రెసిడెంట్ రఘుపతి వసంత్ కుమార్



మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వసంత్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ

ఇంధన వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వినియోగదారుల హక్కులపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రఘుపతి వసంత్ కుమార్ అన్నారు. జిల్లా వినియోగదారుల సమాచారకేంద్రం, జిల్లా వినియోగారుదారుల సమాఖ్య, జిల్లా పౌరసరఫరాలు, యువజన సర్వీసులు, పీ.ఆర్.గవర్నమెంట్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని స్థానిక పీ.ఆర్.కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రఘుపతి వసంత్‌కుమార్, సభ్యులు చక్కా సుసి, చాగంటి నాగేశ్వరరావు, మైనారిటీ సంక్షేమ అధికారి, ఇన్‌ఛార్జ్ సెట్రాజ్ సీఈవో షేక్ ఇమ్రాన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఆర్.రమేష్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సరోజిని తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరం వినియోగదారులమేనని, నిత్య జీవితంలో రోజూ ఏదో ఒక వస్తువును కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్లో లభించే వివిధ రకాల వస్తువుల నాణ్యత, సరైన ప్రమాణాలతో రూపొందాయా అనే అంశంపై వినియోగదారులు దృష్టిసారిం చాలన్నారు. సెట్రాజ్ సీఈవో షేక్ ఇమ్రాన్ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఇంధన పరివర్తనల ద్వారా వినియోగదారులకు సాధికారత కల్పించడం అనే ఇతివత్తంతో ఈ సంవత్సరం వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. డి.చిన్నారావు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం (డీసీఐసీ) కన్వీనర్ భమిడి శివమూర్తి శుద్ధ ఇంధనం, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ప్రాముఖ్యం, వినియోగదారుల హక్కులపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూపొందించిన మేలుకొలుపు పుస్తకాన్ని, కరపత్రాన్ని గౌరవ అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో డీసీపీసీ సభ్యులు అడ్వొకేట్ కొమ్మూరి శ్రీనివాసరావు, సీసీసీ రాజు, భమిడి పవన్ చైతన్య, కళాశాల అధ్యాపకులు తెలిపారు. **పెద్దాపురం :** వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవడం ద్వారా వినియోగ దారుల హక్కులు పరిరక్షించబడతాయని వినియోగదారుల కమిషన్ చైర్మన్ చెరుకూరి వసంత కుమార్ అన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌డిఒ జె సీతారామారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో వసంతకుమార్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించే మార్చి నెల మ్యాగజైన్‌ను సదస్సులో ఆవిష్కరించి అందరికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ కమిటీ సభ్యులు చాగంటి నాగేశ్వరరావు, చెక్కా సుశి, శ్రీనివాస రావు, భళ్ళమూడి సూర్యనారా యణ మూర్తి, తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ ఎల్.మోహన్, పెద్దాపురం వినియోగదారుల ఫోరం కార్యదర్శి మండవిల్లి భాస్కర్రావు, సభ్యులు కె. సుధాకర్, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

10 ఎలక్ట్రికల్ వాహనాల దగ్ధం

బ్యాటరీకి ఛార్జింగ్ పెడుతుండగా అంటుకున్న మంటలు : రూ.12 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎలక్ట్రికల్ వాహనం బ్యాటరీ చార్జింగ్ పెడుతుండగా చెలరేగిన మంటలతో భారీ స్థాయిలో పొగతో కూడా మంటలు ఎగసిపడ్డాయి. చుట్టూ జననివాసం మధ్య జరిగే ఈ ప్రమాదంలో సకాలంలో స్పందించిన అగ్నిమాపక అధికా రులు మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. కాకినాడ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సరళ ఆటోమొబైల్స్‌లో బుధవారం మధ్యాహ్నం షో రూమ్‌కు వచ్చిన వాహనానికి సిబ్బంది వాహనానికి సంబంధించిన బ్యాటరీకి చార్జింగ్ పెడుతుండగా ఆకస్మాత్తుగా పొగ వచ్చి బ్యాటరీ పేలడంతో భయంతో షాపులో ఉన్న సిబ్బంది బయటకు పరుగులు తీశారు. ఈ బ్యాటరీలను సాధారణంగా లిథియం అయాన్ అని పిలుస్తుంటారు. ఇవి పెట్రోల్ కన్నా ప్రమాదకరం కావడంతో, పేలిన బ్యాటరీ నుంచి వచ్చిన మంటలు ఇతర వాహనాలకు అంటుకున్నాయి. దీంతో షాపులో ఉన్న పది వాహనాలకుపైగా మంటల్లో చిక్కుకొని పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాలలిపేట ఎఫ్‌డిఒ ఏసుబాబు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. సుమారు 12 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



బ్యాటరీ కి ఛార్జింగ్ పెడుతుండగా అంటుకున్న మంటలు



గొర్రగేదె మృతదేహం

రైతుల్లో వన్య ప్రాణుల భయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల మెట్ట ప్రాంతంలో రైతులకు ప్రజలకు నిద్ర లేకుండా చేసిన పెద్దపులి సంచారం సంఘటన మరువక ముందే పత్తిపాడు మండలం ఒమ్మంగి శరభవరం మధ్య సరుగుడు తోటల్లో అడవి గొర్రె మృతదేహం లభించటం ఆ ప్రాంతవాసులను భయాందోళనలు గురిచేస్తోంది. ప్రత్తిపాడు మండలం వొమ్మంగి గ్రామం నుండి శరభవరం వెళ్లే రహదారికి ఇరువైపులా గల సరుగుడు తోటల్లో గొర్రెగేదె రైతులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. గతంలో పులి సంచరించిన ప్రాంతంలోనే గొర్రెగేదె మృతదేహం లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడైనా వేటగాళ్ల దాడికి గుర్రై తప్పించుకొచ్చిందా? లేక ఆహారం లభించక మృతి చెందిందా అనేది చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా మైదాన ప్రాంతంలో వన్య ప్రాణుల సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలో ఒకటవ వార్డులో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి బుధవారం రూ.20 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి దాడిశెట్టి రాజా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించగా ప్రజల నుండి వచ్చిన సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల నిధులు ఆ పరిధిలో ఉన్న సచివాలయానికి కేటాయించినట్టు తెలిపారు. రూ.16 లక్షలతో సీసీ రోడ్లో నిర్మాణానికి, రూ.నాలుగు లక్షలతో తాగునీటి ఎద్దడి తీర్చడానికి పబ్లిక్ కుళాయిల పైపులైను నిర్మాణ పనులకు తుని పట్టణ చైర్పర్సన్ సుధారాణి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తుని కో ఆప్షన్ సభ్యులు ఏలూరు బాలు, వైస్ చైర్పర్సన్ పామర్తి మహేష్, రేలంగి రమణ గౌడ్, బోడపాటి శ్రీను, షేక్ క్వాజా, తుని మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ రాజు, కౌన్సిలర్ వారధి జ్యోతి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

మట్టి లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం తాళ్లరేవు పంచాయతీ చెరువుగట్టు సెంటర్ సమీపంలో మెయిన్ రోడ్డుపై వెళుతున్న మట్టి లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. కాజులూరు మండలం శీలలంక ప్రాంతం నుంచి తాళ్ళరేవు మండలం మీదుగా వెళుతున్న మట్టి లారీలు ప్రమాదకరంగా మారాయనీ, గ్రామస్తులు బుధవారం రాత్రి లారీలను అడ్డుకున్నారు. లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తిస్తూ గ్రామస్తుల పట్ల దుర్భాషలాటంతో తాళ్ళరేవు చెరువుగట్టు సెంటర్లో బుధవారం రాత్రి కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా కాజులూరు మండలం శీలలంక గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు లారీని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి కోరంగి ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని, ఎస్ఐ తెలపడంతో గొడవ కొంతమేరకు సద్దుమణిగింది.



మట్టి లారీని అడ్డుకున్న తాళ్లరేవు గ్రామస్తులు

టిడిపి నేతలపై దాడులకు ఖండన

ప్రజాశక్తి-కొత్తపేట

నియోజకవర్గ వ్యాప్తంగా మట్టి, ఇసుక, మద్యం అక్రమ తవ్వకాలు, అమ్మకాలతో రూ.కోట్ల దోచుకున్న కొందరు వైసిపి నాయకులు టిడిపి నేతలపై దాడులకు పాల్పడుతున్నారని మండల అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. బుధవారం వాడపాలెం బండారు స్వగృహం నందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం రాత్రి రావులపాలెం మండలం కొమరాజులంకలో టిడిపి నేత గుర్రాల నాగభూషణం ఇంటిపై కొమరాజులంక సర్పంచ్ అనుచరులు దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వాడపాలెం గ్రామ సర్పంచ్, త్సామా బాబు, కొత్తపేట నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షుడు..పల్లి ఏసు వానపల్లి మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం** అధికారం అడ్డుపెట్టుకుని వైసిపి నాయకుల ఆగడాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయని ఇళ్లపై దాడులకు దిగుతున్నారని కొత్తపేట నియోజక వర్గ టిడిపి నాయకులు విమర్శించారు. రావులపాలెం మండలం కొమరాజులంకలో టిడిపి నాయకులు మాట్లాడుతూ అధికారం అడ్డుపెట్టుకుని మట్టి మాఫియా చెలరేగిపోతోందని ఆరోపించారు. మంగళవారం రాత్రి మాజీ సర్పంచ్ గుర్రాల నాగభూషణం ఇంటిపై జరిగిన దాడిని టిడిపి నాయకులు ఖండించారు. దీనిపై జిల్లా ఎస్‌పికి టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. గ్రామాలలో ఉన్న పట్టా భూముల్లో మట్టిని అక్రమంగా తరలిస్తుంటే కొమరాజులంక మాజీ సర్పంచ్, గ్రామస్తులు కలిసి న్యాయస్థానన్ని ఆశ్రయించారని తెలిపారు. న్యాయస్థానం ద్వారా మట్టి మాఫియా కు అడ్డు తగులుకోవడంతో ఇళ్లపై దాడులకు దిగి భయబ్రాంతులకు గురిచేసి వారు పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీను, ధర్నాల రామకష్ణ, బండారు సత్తిబాబు, ముత్యాల బాబ్జి సయ్యపరాజు రామకష్ణంరాజు, చిలువూరి సతీష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన యువకుడు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో ఈ నెల 9న అదృశ్యమైన యువకుడు బుధవారం ఇంటికి చేరాడు. తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలంలోని దుగ్గుదూరు గ్రామానికి చెందిన కొల్లి ప్రేమ కుమార్ తండ్రి కొల్లి ఇజ్రాయేలుతో కలిసి మండపేటలో దళితపేటలో ఉన్న బంధువులను చూసేందుకు ఈనెల 9న ఉదయం వచ్చాడు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు మండపేట నుండి తిరిగి తన ఇంటికి వెళ్ళే క్రమంలో అదృశ్యమయ్యాడు. దీంతో అతని బంధువులు దినపత్రికలు, సోషల్ మీడియాలోనూ అతని ఫోటో షేర్ చేసి ఆచూకీ తెలపాలని కోరడంతో స్పందించిన కొందరు యానాంలో ఉన్నట్లు చెప్పడంతో బంధువులు అక్కడికి వెళ్లి అతను తీసుకువచ్చారు. ఆచూకీ తెలిపిన వారికి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.